

# ఎవరో తెలిస్తేనా

"శివరామం"

"బావగారూ, బావగారూ !" అని రెండు సార్లు కేకవేసి వాకిట్లో బల్లమీద కూర్చున్నాడు, రామస్వామి. కొంచంసేపు పోయాక పద్మరాజుగారు చేతులు తుడుచుకొంటూ ఇవతలికి వచ్చి, "పెళ్లివా రెప్పుడో దిగారే!" అన్నాడు, మందహాసం మీసాల కొసల్లోనుండి ఎగసం దోస్తూ.

ఇప్పుడే నండీ......" అని రామస్వామి లేచి చెప్పబోతూంటే, "కూచో, కూచో. పెళ్లికూతుర్ని తీసుకువచ్చావా?" అని కుర్చీలో వెన్నువాల్చాడు, కరణంగారు.

"తలుచుకున్నాక బ్రహ్మదేముడడ్డమయ్యేది గాక మాన్తానా? కాని - కరణంగారూ - మీతోవుండండి, ఈరాత్రి వ్యవహారమంతానూ."

"అదేమిటోయి. నీకు శుభకార్యమేమిటి, మధ్య నాతో వ్యవహారమేమిటి!"

"అలా అనకండి, మీరు సాయం చెయ్యకపోతే, మరి గ్రంథం అంతా ఆగిపోతుంది."

"వీలయితే దానికేం, చూద్దాంలే."

"అవ్యవధిగా అనుకున్నాం కాదండీ; అందుచేత......ఈఉపకారం కాస్తా మీరు చేసిపెడితిరా, ఈ జన్మకి మీమేలు మరిచిపోను"

"ఏమిటి బాబూ, అంత నే జేయవలసింది?"

"ఏముందండీ! ఎలికలు కొట్టి పాడు చేశాయికాదూ, బావగారూ! కొత్తది కొనడానికి సావకాశం లేక పోయింది...ఈ నాలుగు రోజులూ ఓసారి యిప్పిస్తిరా"

"ఏమిటి ఇమ్మన్నావు?"

"మళ్లీ మడత మడతలాగ అప్పజెబుతాను"

"సరెలే! చంపుకు తినక, అసలు ఏమిటో తేల్చవేం?"

"అబ్బే! ఏమీలేదు. దోమతెర లేకుండా మరి ఎలాగ చెప్పండి?"...పద్మరాజుగారు పొర్లుకు వచ్చే నవ్వు ఆపుకుంటూ, "అలాగే ఇస్తానులే" అన్నాడు.

"నాచేతికి ఇప్పించండి, పట్టుకు పోతాను. మళ్లీ గదీ గట్రా ముస్తాబు చేసుకోవద్దూ! అట్టే పొద్దుకూడా లేదు" అని, పద్మరాజుగారిచ్చిన దోమతెర శేలం కండువాలో చుట్టబెట్టి, ఆయన దగ్గర సెలవుతీసుకుని బయల్దేరాడు.

రామస్వామి ముప్ఫయి యేళ్ల కమ్మయువకుడు. అన్నవస్త్రాలుకి లోటులేకుండా ఇంత భూమీ, ఒక పెంకుటిలోగిలీ ఉన్నాయి. వ్యవ

సాయం వల్లనే జీవనం గనక ఆరోగ్యంగానూ, బలంగానూ ఉంటాడు. తాను నిశానీపద్దే అయినా, కమ్మప్రభువుల్నీ ప్రత్యేకంగా తన వంశాన్నీ పొగిడే పండితులుంటే ఏ స్వల్పంగానో బహూకరించే బుద్ధిమంతుడు. మంచి చొరవగల మనిషన్న విషయం అతనికి జువ్వలు విసరడంలో ఉన్న ప్రజ్ఞే చెబుతుంది. సాధ్యమైనంతవరకూ తనకోసం కంటే ఇతరులకోసం ఎక్కువ పాటుపడే మహాత్యాగి. అన్నిటికన్నా గొప్పవిశేషం ఏమిటంటే—ఏలాటి అసమయాన్నైనా సరే 'దొంగా' అన్న కేక వినిపించిందా, ఉన్నపాటున పరుగెత్తుకు వెళ్లి—నిజమైనా కాకపోయినా—'దొంగ'ని పిలక పట్టుకు లాక్కువచ్చాడన్న మాటే! అతని ఆసరా చూసుకునే గవర్నమెంటు ఆ గ్రామంలో ఒక్క పోలీసునీ ఏర్పాటు చేయలేదని ప్రతీతి.

రామస్వామికి చిన్నతనంలోనే అప్పగారి కూతుర్నిచ్చి పెళ్లిచేశారు. ఆ అమ్మాయి బస్తీలోవుండి చదువుకుంది. పుట్టింటివారు భాగ్యవంతులు. అందుచేతో, మరి ఏఇతర కారణాలో తెలియదుకాని రామస్వామి ఎన్నిసార్లు కార్యం చేయమని అడిగినా ఆమె ఒప్పుకోలేదు. చివరికి ఒకరోజున తిక్కవచ్చి, రామస్వామి అత్తవారింటికి వెళ్లి పెళ్లాన్ని బండెక్కించి లాక్కు చక్కావచ్చాడు. ఇంక ఎలాగా తప్పదనో, మరేమో, ఆమె భర్త వెంట బయల్దేరి చక్కావచ్చింది. యాయవారపు బ్రాహ్మడు పంచాంగం చూసి, 'ఈవేళే మంచి ముహూర్తం ఉంది; కార్యం దిగ్విజయంగా జరుగుతుం'దని చెబితే శుభం అని నడుం కట్టాడు, రామస్వామి.

కరణంగారి యింటివద్ద దోమతెర లగాయతు అద్దాలేమిటి, పటాలేమిటి ఏవి లభ్యపడితే అవల్లా సేకరించి, తూర్పువేపు గదిలో అలంకరించాడు. పిల్లలేడిస్తే గోదావరి స్టేషన్లో బడి పంతులుకొన్న దూదికోళ్లు కూడా తెచ్చి గూట్లో పెట్టాడు. నాలుగైదు పళ్లాల్లో పూతరేకులూ, పంచదార చిలకలూ వగైరాలు అలమారులో పెట్టి తాళం వేశాడు. ఎలాగైతేనేం సాయంకాలానికి గదిముస్తాబంతా ముగించుకుని, [బూజూ గట్రావుంటే తీరుబడిగా తరవాత దులుపుకోవచ్చునని ప్రస్తుతం విరమించి] ఇవతలికి ఊడిపడ్డాడు.

కరణంగారి యింటిముందున్న ధర్మసావిట్లో ప్రతిరోజూ సంజవేళ నలుగురూ చేరుకుని పిచ్చాపాటీ చెప్పుకోవడం పరిపాటి. ఆవేళ బాతాఖానీ అంతా రామస్వామిని గురించే. అతన్ని చూసేసరికి మరీ జోరయాయి కబుర్లు. ఓ మోస్తరుగా ప్రారంభించి క్రమంగా పచ్చి శృంగారం లోకి దిగిపోయారంతా. వయస్సు మళ్లినవాళ్లు వాళ్ల చిన్నతనం గొడవలు చెప్పడం; పడుచువాళ్లు జరగబోయే వాటినిగూర్చి తాము కంటూన్న కలలు కోయడం; ఇటూ అటూ కాని వాళ్లు ఊకొడుతూ వినడం; మధ్య మధ్య అంతా కలిసి రామస్వామిని వేళాకోళాలు ఆడడం;—ఇలా కొంత కాలక్షేపం అయింది.

ఉండి ఉండి ఒకతాత, "ఏమిట్రా మనవాడికేదో వచ్చిందిట" అన్నాడు, రామస్వామిని సూచిస్తూ.

"అప్పుడేనా!" అన్నాడు, కరణంగారి అల్లుడు.

"అదికాదయ్యా! అల్లుడుగారూ! రామస్వామికి కలక్టరు గారేదో యిప్పించారుట"

"అదా!...ఈరిగాణ్ణి పట్టుకుని పోలీసులికి ఒప్పజెప్పినందుకు మెడల్సు ఇచ్చారు. ఏదిరా, మెడలో కట్టుకోలేదేం!"

"నల్లలాంకోటు తొడిగినప్పుడు కాని కట్టుకోడులే"

"అదీకాక, కొత్తవారెవరూ రాలేదే, ఇక్కడికి!"

"దానికేమిగాని, ఈరిగాడి తమ్ముడికి మహాకోపంగా ఉంది, రామస్వామిమీద. ఎప్పుడో సమయంచూసి గాదికి కన్నం పెడతాట్ట". అన్నాడు తాత.

"ఏడిశాడు. రామస్వామి ఇంటి కేమిటి, దొంగ రావడమేమిటి!" అన్నాడొక యువకుడు.

"నిజంకూడా అంతేనే గాని, యీవేళ మనవాడు మహాధ్వజాయ మానంగా ఉంటాడుగా. అందుచేత వాడికి మంచిసమయం"

"ఔను సుమీ. కాస్త మనం నలుగురం ఈనాలుగు రోజులూ కాపలా కాశామంటే, తరవాత ఫరవాలేదు" ఇంతవరకూ చుట్ట కాల్చుకుంటూ ఒకమూల కూచుని తన్నుకాదన్నట్టు ఉలుకూ పలుకూ లేకుండా ఉన్న రామస్వామి నెమ్మదిగా లేచి, "ఏమిటయ్యా, మహా చెబుతున్నారు? నాయింటికి ఒకళ్లు కాపలా కాయడమా? ఏడిశారు. ఏదొంగ వస్తాడో రానీ, చూస్తా" అన్నాడు, పౌరుషంగా.

"వస్తాడని కాదురా. కొంచెం జాగ్రత్తగా ఉండడం మంచిది, ఎందుకైనా," అన్నాడు, తాత.



"నాకు తెలుసులేవోయ్; మాయింటికి కన్నంవేసే దొంగ ఇకముందు పుట్టాలేమో గాని..."

"సరే నీయిష్టం. విన్నసంగతి చెప్పాలి గనక చెప్పాము"

"మహా గొప్పపని చేశారు" అని లేచి చక్కాపోయాడు, రామస్వామి.

రాత్రి బంధువులు నలుగురూ రావడంవల్ల భోజనా లయ్యేసరికి చాలా ఆలస్యమైంది; వచ్చినవాళ్లల్లో ఎవరికీ త్వరగా తెమిల్చి పోదామనీ ఉద్దేశం ఉంటేగా! రామస్వామి ఎంత విసుగు కనబరచినా పన్నెండు కొడితే గాని ఎవరూ కదల్లేదు. అభినందనాలతో కొందరూ, దీవనలతో కొందరూ, హాస్యాల తో కొందరూ, 'దొంగమాట మాత్రం మరచి పోవ'ద్దనే హెచ్చరికలతో కొందరూ, నెమ్మదిగా దయచేశారు. రామస్వామి చుట్టూ గిట్టా కాల్చుకుని [ఎందుకేనా మంచిదని దొడ్డి నాలుగుమూలలూ తిరిగివచ్చి] తిన్నగా గది లోకి వెళ్లాడు. పెళ్లికూతురు మంచంమీద అటుతిరిగి పడుకుంది.

ఆమెను లేపడమా, మానడమా, అనే సమస్యలో చిక్కుకున్నాడు, పెళ్లికొడుకు. నిద్ర పోతూంటే లేపకూడదేమో! లేపకపోతే దోమ తెరా అద్దాలూ అవీ అనవసరంగా వృథా అయిపోతాయే! ఏమీ తోచక ఆలోచిస్తూ నిలబడి ఉండగా బయట, గాదెసమీపాన్ని, ఏదో చప్పుడైంది. ఒక్కక్షణం ఆగి కిటికీ తలుపు తెరచి చూశాడు. ఏమీ కనుపించ లేదు.

మళ్లీ మంచందగ్గరకు వెళ్లి నిలబడ్డాడు. దగ్గాడు. ఆమె కదలలేదు. చప్పుడయ్యేట్టు గూటితలుపు తీసి పూల రేకుల పళ్లెం తీశాడు. ఆమె అలాగే పడుకుని ఉంది. పళ్లెం కింద, పెట్టి, ఇంక ఊరుకోలేక, తెగించి, ఆమెను తట్టి లేపాడు. కళ్లు నులుముకుంటూ లేచి, చూసి, గప్పున కిందికి దూకింది. రామస్వామి ఆమె రెండు చేతులూ పట్టుకుని దగ్గిరకు లాక్కో పోయాడు. ఆమె విదిలించుకుంది. అతను జారిపోతూన్న ఆమె పైటకొంగు గ్రహించి... బయట మళ్లీ చప్పుడైంది. అలాగే నిలబడి విన్నాడు. మళ్లీ చిన్న సవ్వడి వినిపించింది. మెల్లిగా గదితలుపు తెరచి వసారాలోకి వెళ్లి చూశాడు. అంతా చీకటి నిశ్శబ్దమున్ను. చుట్టు ముట్టించి ఎవరు వారని కేకవేశాడు. ఎవ్వరూ పలకలేదు. గాది చుట్టూ ప్రదక్షిణం చేసివచ్చాడు. ఏమీ కనుపించలేదు. మెల్లిగా గదిలోకి వెళ్లి తలుపు దగ్గిరగా వేసి వారగా నిలబడ్డాడు, ఒళ్లల్లా కళ్లుచేసుకుని.

పెళ్లికూతురు, కొంచెంసేపు అయాక, ఇటు చూసి, అటుచూసి, "ఏమిటిది?" అంది, ఒక్క అడుగు ముందుకువేసి. మాట్లాడవద్దని చేత్తో సైగచేశాడు రామస్వామి. నాలుగైదు నిము షాలు ఇద్దరూ అలాగే ఉండిపోయారు; అతడు శ్రద్ధగా వింటూ, ఆమె ఏమి చేయాలా అని ఆలోచిస్తూ.

ఆమె ఇంక ఉండబట్టలేక పోయింది. "ఎందుకలా, నిలబడి ఉండడం? పొద్దుపోయింది, వెళ్లి పడుకోరాదూ!" అన్నది, చిరునవ్వుతో. రామస్వామి కొంచెం తటపటాయించి, చివరికి నిశ్చయంలోకి వచ్చి, తలుపు గడియవేయ బోతూంటే—ఈసారి స్పష్టంగా ఏదో తవ్వుతూన్న చప్పుడైంది, గాది దగ్గిరగా. గప్పుమని తలుపుతీసి, ఆమె జారిస్తూ చొక్కా కొంగు పట్టుకు లాగితే, విదిలించుకుని, చీకట్లోకి దూకాడు రామస్వామి.

ఆమె తెల్లవార్లూ కాచుకుని కూచుంది; ఇహనే వస్తాడో, ఇప్పుడే వస్తాడో అని. రా లేదు. పొద్దెక్కింది. రాలేదు. మధ్యాహ్నం పదకొండు కొట్టినా రాలేదు.

వచ్చిన బంధువులంతా నాలుగుమూలలకీ వెతకడానికి బయల్దేరారు. వెతగ్గా వెతగ్గా ఒక పొలంలో గట్టు వారని చేతులూ కాళ్లూ కట్టివేయబడి పడిఉన్నాడు రామస్వామి. కొంద్దరు ఓదారుస్తూ, అతనికి బంధమోక్షం చేసి మూడుజాము లయ్యాక ఇంటికి తీసుకువచ్చారతన్ని —

తరవాత్తరవాత రామస్వామి పిల్లల్ని కన్నాడు. ముసలివాడు కూడా అయాడు. కాని కరణంగారి యింటిముందు ధర్మసావిట్లో నలుగురూ నవ్వుతూ తనకథ చెప్పుతుంటూ, "ఆ రాత్రి ఏంజరిగింది తాతా? దొంగ దొరికాడా?" అని అడిగితే, నెరిసిన మీసాలు దువ్వుతూ, సకిలించి, అనేవాడు "ఎవరో తెలిస్తేనా" అని.


# పంచవటి

(అయిదు కథలు)

## శ్రీ శ్రీనివాస శిరోమణి

రచించినవి


ఈ మాసాంతమునకు తయారు అవుతుంది.

ఏ పాశ్చాత్య కథకుల వాసనలూ లేకుండా స్వతంత్రముగా వ్రాసిన కథకులలో యీయన అగ్రగణ్యుడని చాలామంది పెద్దల అభిప్రాయము.

## ది ఓరియంటల్ బుక్ డిపో

మద్రాసు





ముందుగ మనియార్డరు చేయువారికి తపాలా ప్యాకింగు ఉచితము

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1. | కలియుగ వినోద కథలు | ... | 1 | 0 | 0 |
| 2. | హస్త శాస్త్రము ... | ... | 2 | 0 | 0 |
| 3. | స్త్రీ పురుష ప్రేమ రహస్యములు | ... | 1 | 0 | 0 |
| 4. | దాంపత్య రహస్యములు | ... | 1 | 0 | 0 |
| 5. | శరీర మర్మ శాస్త్రము | ... | 1 | 0 | 0 |
| 6. | సతీపతీ కుతూహల రహస్యములు | ... | 2 | 0 | 0 |
| 7 | కాశీ రామేశ్వర మజలీ కథలు | ... | 1 | 0 | 0 |
| 8. | కుప్ప వేదాంత తమోభాస్కరం | ... | 1 | 4 | 0 |
| 9. | పులిప్పాణి వైద్య రహస్యములు | ... | 1 | 8 | 0 |
| 10. | వేమన పద్యములు (3200 పద్యములు) | ... | 2 | 8 | 0 |
| 11. | మన్మథ శాస్త్రము ... | ... | 0 | 8 | 0 |

తపాలా చార్జి ప్రత్యేకం.

## ది ఓరియంటల్ బుక్ డిపో

మద్రాసు